క్లుప్తంగా

శ్రామిక మహిళల హక్కుల కోసం ఉద్యమించాలి



సదస్సులో మాట్లాడుతున్న దయా రమాదేవి

ఏలూరు (టూటౌన్): సమాజంలో శ్రామిక మహిళల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (సీఐటీయూ) రాష్ట్ర నాయకురాలు దయా రమాదేవి పిలుపునిచ్చారు. ఏలూరులో యూనియన్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. శ్రామిక మహిళలకు నేటికీ సమాన వేతనాలు అమలు కావడం లేదన్నారు. అనేక చోట్ల వేధింపులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అనేక సేవలందిస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మిడ్‌డే మీల్, మెప్మా, కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సుభాషిణి, సుధారాణి, దుర్గాంబ, ఎం.నాగమణి, చెల్లాయమ్మ, పి.వెంకటరమణ, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎంహెచ్‌ఏలో నేడు, రేపు స్వాతంత్ర్య వేడుకలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు యర్రా సోమలింగేశ్వరరావు, జవ్వాజి మోహన విఠల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, మంగళవారం ఉదయం 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, 11 గంటలకు విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తారన్నారు. రాత్రి 7 గంటలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రంగా విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): కలిదిండి మండలం సానా రుద్రవరం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఏలూరు జిల్లా కాపు సంక్షేమ సేన అధ్యక్షులు పులి శ్రీరాములు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. దీనికి కారకులైన వారిని కనిపెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఉజ్వలం.. సురక్షితం



ఏలూరు పంపుల చెరువు



ఏలూరు బృందావనం పార్క్ చెరువు

- ఏలూరులో తాగునీటి సరఫరా మెరుగునకు చర్యలు
- రూ.8.40 కోట్లతో ఆరు చెరువుల అభివృద్ధికి ప్రణాళిక
- ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రత్యేక చొరవతో నిధులు విడుదల
- పనులను ప్రారంభించాలంటూ అధికారులకు ఆదేశాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం, ఏలూరు నియోజకవర్గ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ఏలూరు నగర అభివృద్ధికి తనదైన ముద్ర వేస్తున్నారు. పేదలకు సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవడమే కాక గూడు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఆధునిక వైద్యానికి బాటలు వేస్తూ ప్రభుత్వ మెడికల్ కళాశాల తెచ్చారు. ఇక సురక్షిత తాగునీటిని ప్రతి ఒక్క కుటుంబానికి అందించాలనే లక్ష్యంతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో నగరం, ఏడు విలీన గ్రామాల్లోని ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు అమృత్ పథకం 2.0లో నిధులు మంజూరు చేయించారు.

చెరువుల ఆధునికీకరణకు నిధులు

ఏలూరు నియోజకవర్గంలోని సుమారుగా ఐదు లక్షల మంది జనాభా అవసరాలకు అనుగుణంగా సురక్షిత తాగునీటిని అందించే దిశగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల చర్యలు తీసుకుంటున్నారు. అమృత్ పథకం 2.0లో ఏలూరుకు ఏకంగా రూ.8.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో నగరంలోని పలు చెరువుల ఆధునికీకరణ, పునర్‌వ్యవస్థీకరణ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఏలూరు పంపుల చెరువు, ఫిరంగుల దిబ్బ, బృందావనం చెరువు, పోణంగి పెద్ద చెరువు, గజ్జలవారి చెరువు, చొదిమెళ్లలోని కొత్త చెరువులను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. చెరువుల్లో పూడిక తొలగించి, గట్లను పటిష్టం చేయటంతోపాటు, పూర్తి స్థాయిలో తాగునీటి అవసరాలు తీర్చేలా వాటిని ఆధునికీకరణ చేయాలనే ధ్యేయంగా ఉన్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇప్పటికే అధికారులతో సమీక్షించి, పనులను ప్రారంభించేందుకు ప్రతిపాదనలు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు నగర ప్రజలు భవిష్యత్‌లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఇంజనీరింగ్ అధికారులు డీపీఆర్‌లు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రజలకు రక్షిత తాగునీరు



ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికీ రక్షిత తాగునీటిని సరఫరా చేయాలనే సంకల్పంతో ఉన్నారు. అమృత్ పథకం 2.0లో ఏలూరుకు భారీగా నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే నాని సక్సెస్ అయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఏలూరు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే నాని విశేష కృషి చేస్తున్నారు. ఆరు చెరువులు అభివృద్ధి చేయటం ద్వారా భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తవు.

– సుంకర చంద్రశేఖర్, 6వ డివిజన్ కార్పొరేటర్, ఏలూరు

ఎమ్మెల్యే నానితోనే సాధ్యం



ఏలూరులో గతంలో వేసవి వస్తే తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉండేవి. కానీ ఏలూరు ఎమ్మెల్యేగా ఆళ్ల నాని హయాంలో మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఏలూరు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు అప్పట్లోనే సుమారుగా రూ.100 కోట్లతో ఏలూరు శివారులో 110 ఎకరాల్లో గోదావరి జలాలతో తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. వేసవిలో నాలుగు నెలలకు సరిపడా నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యంతో చెరువును ఏర్పాటు చేసిన ఘనత ఎమ్మెల్యే నానికే దక్కుతుంది.

– ప్రత్తిపాటి తంబి, ప్రముఖ న్యాయవాది, ఏలూరు

అభివృద్ధికి చిరునామా



ఏలూరు అభివృద్ధికి ఎమ్మెల్యే ఆళ్ల నాని కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు. ఏలూరు మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయించటంలో, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎమ్మెల్యే కీలకపాత్ర పోషిస్తున్నారు. నేడు మూడోసారి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించి నగరంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. 30వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి గూడు కల్పించారు. తాజాగా 7 విలీన గ్రామాల్లో, నగరంలో ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా రూ.8.40 కోట్లు నిధులు మంజూరు చేయించారు.

– నిడికొండ అన్నపూర్ణ, 13వ డివిజన్ కార్పొరేటర్, ఏలూరు

వాటర్ డిస్పెన్సర్ బహూకరించిన ట్రైనీ కలెక్టర్

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం శాఖా గ్రంథాలయానికి ఏలూరు ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ సుమారు రూ.12,550 విలువ గల వాటర్ డిస్పెన్సర్‌ను బహుకరించినట్లు గ్రంథాలయ అధికారిణి ఎస్.రామలక్ష్మి చెప్పారు. గతంలో కూడా ట్రైనీ కలెక్టర్ విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించి రూ.15 వేలు విలువైన పుస్తకాలను బహుకరించినట్లు తెలిపారు. ఈ వాటర్ డిస్పెన్సర్‌ను ఆదివారం ప్రారంభించామని ఆమె చెప్పారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ సోడెం క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ లంకలపల్లి గణేష్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో నగరంలోని పలు డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. 9వ డివిజన్ మోటేపల్లివారి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్, పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్ ఆదివారం ప్రారంభించారు. సుమారుగా రూ.5 లక్షలతో మోటేపల్లివారి వీధి పిచ్చుకలగుండ ప్రాంతంలోనూ సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అదేవిధంగా యానాదుల కాలనీ, కబేళా ప్రాంతాల్లోనూ కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. డివిజన్‌లో ప్రజలకు అవసరమైన సదుపాయాలు, సేవలను అందించేందుకు తాము అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లంకలపల్లి దుర్గాప్రసాద్, సోమరాజు తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	44-80
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	60-68	బీట్‌రూట్	36
కాకర కాయలు	50-60	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	44	అల్లం	140-240
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	17
క్యారెట్	36	పాలకూర	15
దొండకాయలు	32	చుక్కకూర	15
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	27	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	36	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-30	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	14

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	22
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	27

విద్యార్థులకు విలువలు బోధించాలి



ఆర్‌జేడీ విజయ భాస్కర్‌ను సన్మానిస్తున్న అపుస్మా ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మానవ విలువలను సైతం సందర్భానుసారం బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ సూచించారు. ఏపీ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) దెందులూరు నియోజకవర్గ స్థాయి సమావేశం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులను భయపెట్టకుండా ఇతరులతో పోల్చకుండా మంచి ఉదాహరణలతో పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ప్రతి పాఠ్యాంశంలో మానవ విలువలు ఇమిడి ఉంటాయని, వాటిని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవ మెదడు ఎంతో శక్తివంతమైనదని, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు మానవ మస్తిష్కం నుంచే వెలువడినవనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రమించాలన్నారు. దెందులూరు మండలంలోని 37 ప్రైవేట్ స్కూల్స్ నుంచి ఒక్కొక్క ఉత్తమ ఉపాధ్యాయుడు, ఉత్తమ ఉపాధ్యాయినిని ఎంపిక చేసి టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమం కింద ఘనంగా సన్మానించారు. అపుస్మా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ శ్రీకాంత్, రాష్ట్ర సలహాదారు కె.సురేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు జి.బుల్లబ్బాయి, దెందులూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజ్‌కుమార్, జి.వెంకట రమణ, కోశాధికారి బి. సాయిబాబు, కార్యవర్గ సభ్యురాలు కడియాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి

ఏలూరు డీఎస్పీ ఐ.శ్రీనివాస్



జాతీయ రహదారి వద్ద బ్లాక్ స్పాట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏలూరు డీఎస్పీ ఐ.శ్రీనివాస్, సీఐ వి.వెంకటేశ్వరరావు

భీమడోలు: రహదారులపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఏలూరు డీఎస్పీ ఐ.శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రీయ, జాతీయ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను ఆదివారం సాయంత్రం భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. పూళ్ల, పోలసానిపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించిన వాటిని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదికను సంబంధిత నేషనల్ హైవే అథారిటీకి సమర్పిస్తామన్నారు. అనంతరం డీఎస్పీ ఐ.శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినా ఎటువంటి ప్రాణాపాయం లేకుండా సురక్షితంగా బయట పడవచ్చన్నారు. హైవేలపై ప్రయాణిస్తున్న వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ సంబంధిత లైన్లలో ప్రయాణించాలన్నారు. అధిక వేగంతో వెళ్లే వాహనాలు డివైడర్ పక్కగా, మధ్యస్థ వేగంతో వెళ్లే వాహనదారులు మధ్య లైన్లలో, నిదానంగా ప్రయాణించే మోటార్ వాహనాలు పూర్తిగా ఎడమ వైపునే ప్రయాణించాలన్నారు. తద్వారా ప్రమాదాలు నూరు శాతం తగ్గుతాయన్నారు. నేషనల్ హైవే వెహికల్స్ పార్కింగ్ కోసం పార్కింగ్ బేలను కేటాయించామని, నిర్దేశించిన స్థలాల్లో హైవే వెహికల్స్‌ని పార్కింగ్ చేయడం వల్ల వాహనాల్ని ఢీకొట్టే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనచోదకులపై భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చావా సురేష్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ



ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇంటిలో ఓటర్ల వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణను పారదర్శకంగా చేపట్టాలని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని వార్డు సచివాలయం పరిధిలోని పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఆదివారం నిర్వహించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇంటికి వెళ్లిన బీఎల్‌వోలు ఇంటిలో ఓట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలోని పేర్లతో సరిచూసి, వాటిలోని వివరాలను యాప్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఎలాంటి విమర్శలకు తావులేకుండా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా, నిబద్ధతతో చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోపే పూర్తి చేయాలన్నారు. ఒకే ఇంటి నంబర్‌లో అధిక సంఖ్యలో ఓట్లు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డూప్లికేట్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్ళిన వారి ఓట్లను తొలగించే సమయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలు విధిగా పాటించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటర్ల జాబితాలో నమోదుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రవికుమార్, సచివాలయ సిబ్బంది, ఉన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



ఏలూరులో జాతీయ జెండాను పంపిణీ చేస్తున్న నడపన దాన భాస్కర్

ఏలూరు (టూటౌన్): హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలు చోట్ల జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షులు నడపన దానభాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై, కార్యాలయాల్లో, వ్యాపార సంస్థల్లో జాతీయ జెండా ఎగురవేసి దేశంపై గౌరవం, ప్రేమ, భక్తి చూపాలన్నారు. ఎంతోమంది మహనీయుల ప్రాణత్యాగం ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని, స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా వారందరినీ స్మరించుకుని గౌరవించడం మన కర్తవ్యమన్నారు. అలాగే సమాజం, దేశం పట్ల బాధ్యత గల పౌరులుగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల శ్రీకృష్ణ దేవరాయలు, చేకూరి గణపతి, కొప్పిశెట్టి వేణుగోపాల్, గెద్దాడ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల చట్ట సవరణ తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ఏలూరు (టూటౌన్): పేదలకు నష్టం కలిగించేలా ఉన్న అసైన్‌మెంట్ భూముల చట్ట సవరణను నిలుపుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కోరారు. స్థానిక పవరుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం వలన భూస్వాములకు, పెత్తందారులకు ప్రయోజనం కలిగి పేదలు నష్టపోతారన్నారు. గ్రామ సచివాలయాల వద్ద అసైన్‌మెంట్ భూముల ఆక్రమణదారుల పేర్లు బహిర్గతం చేయాలన్నారు. వెంటనే అసైన్‌మెంట్ కమిటీలను వేసి చర్చించాలన్నారు. పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో లక్షలాది ఎకరాల అసైన్‌మెంట్ భూములు భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ఈ భూములను బినామీల పేర్లతో దర్జాగా అనుభవిస్తున్నారన్నారు. అసైన్డ్ భూముల చట్ట సవరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, జి.రాజు, మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, బి.సోమయ్య, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, టి.దుర్గారావు పాల్గొన్నారు.

సంస్కృతానికి సముచిత స్థానం కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న దోర్బల ప్రభాకర్ శర్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో అమలు చేస్తున్న నూతన విద్యా విధానంలో సంస్కృత భాషకు కూడా సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సంస్కృత భాష ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృత భాష ఉపాధ్యాయ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న కాంపోజిట్ తెలుగు సంస్కృతం రద్దు చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో తెలియచేయడంతో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్కృత ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. సంస్కృత భాషకు తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ భాషలతో సమానమైన ప్రతిపత్తి కల్పించాలని కోరారు. సంస్కృత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతనంగా సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘ గౌరవ అధ్యక్షులుగా ఆచార్య దోర్బల ప్రభాకర్ శర్మ, అధ్యక్షులుగా మరుధురి నరసింహాచార్యులు, ఉపాధ్యక్షులుగా రాంబాబు, కార్యదర్శిగా మాకన వెంకటేశ్వర్లు, కోశాధికారిగా శ్రీష్ఠి రఘురాం, మహిళా కార్యదర్శిగా గుడివాడ ప్రశాంతి, ప్రచార కార్యదర్శిగా తట్టా తాండవ కృష్ణ, ప్రధాన సలహాదారుగా ఎస్ఎల్ఎస్ శర్మలను ఎన్నుకున్నారు.

సుగ్రీవ లింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం



వసంతవాడలోని సుగ్రీవలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్న వేద పండితులు

పెదపాడు: అధిక శ్రావణ మాసం పురస్కరించుకుని వసంతవాడలోని సుగ్రీవలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఉదయం విఘ్నేశ్వరపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం రుద్ర యాగం నిర్వహించారు. ఈ పూజాక్రతువులను పండితులు సామవేదం అరుణ్‌కుమార్ శర్మ, మారుతీ శర్మ నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకులు చావలి లలితాంబికేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాకార్యక్రమాల్లో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. స్వామి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.